క్లుప్తంగా

విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్ గుల్మార్గ్‌లో జరిగిన జాతీయ నాలుగో ఐస్ కర్లింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం ఆయన కార్యాలయంలో సత్కరించారు. కాకినాడకు చెందిన ఎన్.శేషు రిషిత్ రెడ్డి, బి.నాగేంద్రఠాగూర్, కె.షణ్ముఖ, చైతన్య, హర్ష సబ్ జూనియర్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించారు. మిక్స్‌డ్ టీంలో బి.శ్రీదేదీప్య, మిక్స్‌డ్ డబుల్స్‌లో రజిత పతకం పొందింది ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ అధికారి బి.తేజశ్రీ, కోచ్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించండి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో వాహనాల భద్రత, పార్కింగ్ క్రమబద్ధీకరణ, రోగులకు అందుతున్న వైద్య సేవల్లో ఆటంకాలు నివారించడానికి ప్రత్యేక పార్కింగ్ ప్రణాళికను సిద్ధం చేయాలని కాకినాడ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఈ దిశగా కలెక్టర్ చొరవచూపాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలు వార్డుల్లోకి వేసుకెళ్లి అక్కడ పార్క్ చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. వార్ఫ్ రోడ్‌లో ఉన్న టీబీ వార్డు ఆవరణను వాహనాల పార్కింగ్‌కు వినియోగించడం ద్వారా ఆసుపత్రిలో పార్కింగ్ వ్యవస్థ క్రమబద్ధీకరించ వచ్చని ఆయన తెలిపారు. టీబీ వార్డు నుంచి జీజీహెచ్‌కు చేరేందుకు ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించాలని రమణరాజు పేర్కొన్నారు.

నేడు ఓటరు దినోత్సవ ర్యాలీ



ఓటర్ల ర్యాలీపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సుధాకర్

కాకినాడ సిటీ: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, తహసీల్దార్ జితేంద్ర వేర్వేరుగా తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ సిబ్బందితో సమావేశం సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. ఈ ర్యాలీలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రజల్లో ఓటు చైతన్యాన్ని కలిగించనున్నట్లు తెలిపారు. ర్యాలీ జిల్లా పరిషత్ సెంటర్‌లో ప్రారంభమై, కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయం వరకు సాగుతుందన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అదనపు కమిషనర్ సుధాకర్ నగరపాలక సంస్థ సిబ్బందితో చర్చించినట్లు తెలిపారు.

నిందితుడికి 9 ఏళ్ల జైలు

కాకినాడ రూరల్: మండల పరిధిలోని వాకలపూడి గ్రామానికి చెందిన ఒక మహిళను లైంగికంగా వేధించి, హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు కొరుప్రోలు వెంకన్నకు రాజమహేంద్రవరం 8వ జిల్లా సెషన్స్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు తొమ్మిదేళ్ల జైలు శిక్ష విధించారు. సర్పవరం సీఐ పెద్దిరాజు తెలిపిన వివరాల ప్రకారం 2022లో మహిళను వేధించి, హత్యాయత్నానికి పాల్పడిన వెంకన్నపై సర్పవరం పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్సై వి.మౌనిక కేసు నమోదు చేశారు. కేసు విచారణ, వాదోపవాదాలు అనంతరం నిందితుడికి జైలుతో పాటు రూ.7 వేలు జరిమానా విధించారు.

ప్రజ్ఞా వికాస పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రమేష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి ఒకటి నుంచి మూడో తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాస పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ పిల్లి రమేష్ కోరారు. ఈ మేరకు తన చాంబర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి ఈ పరీక్ష విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సూరిబాబు, కేవీవీ నగేష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారికి మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి 3 వేలు, తృతీయ బహుమతి 2 వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

వచ్చే నెల 9న సైన్స్ ప్రదర్శన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రేవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న రామచంద్రపురంలో నిర్వహించే సైన్స్ ప్రదర్శన విజయవంతం చేయాలని ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణసాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి పీజీ వరకూ చదువుకునే విద్యార్థులు పాల్గొవచ్చని, ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతితో పాటు పుస్తకాలు, సైన్స్ కిట్లు అందజేయనున్నట్టు తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 30వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వివరాలకు 98661 30320 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

సందె స్నోయగం



కాకినాడ రూరల్ రేపూరు గ్రామంలో...



ఆర్టీవో కార్యాలయం రహదారిలో..




కరప గ్రామ దేవత ఉప్పాలమ్మ గుడి ప్రవేశ ద్వారం వద్ద ఇలా..



కాకినాడ రేపూరులో మంచుతెరలను చీల్చుకుంటూ వస్తున్న భానుడు

కరప/కాకినాడ రూరల్: ఎంత చలితో వణికిపోతున్నా.. ముసుగుదన్ని లేవలేకున్నా.. ప్రకృతి సోయగాన్ని ఆస్వాదించేవారు ముడుంకె వేసుకుని ఉండలేరుగా.. అలాంటి వారెందరో ఇదిగో ఇలా మంచు తెరల్లో పల్లె అందాల ఆవిష్కరణలకు ఉత్సాహం చూపుతుంటారు. వేసవిలో ఎండమావులు.. వానాకాలంలో వానచుక్కల.. జల్లుల.. తుంపరల చిటపటలు.. శీతవేళ ఇరు సందెల్లో మంచు తెరలు.. పొగమంచు.. మంచు ముత్యాలు.. మనసుతో చూసే కనులుండాలే కానీ ప్రకృతి చిత్రాలకు కొరతేముందంటారు.. **సాయంత్రం ఆరుకు మొదలయ్యే తుషారం ఆ రాత్రం**తా తెరలా పల్లెలను కమ్ముకుని పొద్దొచ్చింది పొడుస్తానన్న సూర్యుడిని సైతం పోపొమ్మంటూ.. నేలతల్లికి నేత చీర కట్టాలని మేముంటే నీ గోలేంటని ముద్దుగా విసుక్కుంటోంది. ఇదిగో ఈ దృశ్యాలు చూస్తుంటే అలానే ఉంది కదూ.. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప, రూరల్ మండలాల్లో శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు ఎక్కడ చూసినా ఈ చిత్రాలే. కనువిందు చేస్తున్న ఈ చిత్రాలను 'సాక్షి' ఇలా ఒడిసి పట్టింది. మరో కోణంలో చూస్తే రెక్కాడితే కానీ డొక్కాడని జీవులకు ఈ పొద్దు ఎంతో కష్టంగా అనిపించింది. దారి కనపడక.. ఎముకలు కొరికే చలిలో.. వాహనం వేగం పెంచే కొద్దీ మరింత గడ్డకట్టుకుపోతామేమో అనేంత భయంతో నెమ్మదిగానైనా గమ్యాలకు చేరిపోయారు. రథ సప్తమి నుంచి ఎండలు పెరుగుతాయని, అప్పటి వరకు ఈ శీతగాలులతో వేగేదెలా అని పెద్దలు పెదవి విరుస్తున్నారు.



కరప-రామచంద్రపురం రోడ్డులో దట్టంగా కురుస్తున్న మంచు



కరపలోని వాకింగ్ ట్రాక్‌పై మంచుదుప్పటి



కొరిపల్లి రోడ్డులో ఇళ్లపై కమ్ముకున్న మంచు

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ షణ్మోహన్ సగిలి
- కోరమాండల్‌లో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ
- ఉత్సాహంగా బాలికా దినోత్సవాలు

కాకినాడ రూరల్: బాలికలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. స్థానిక కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రాంగణంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా యంత్రాంగం బాలికల రక్షణకు ఏర్పాటు చేసిన వాట్సాప్ టోల్ ఫ్రీ నంబర్‌ను అందరికీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ప్లాంట్ పరిసర ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని 30 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమానికి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్, కోరమాండల్ ఫైనాన్స్ మేనజర్ కృష్ణకిశోర్, సీఎస్సార్ మేనేజర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

ఆడ పిల్లల కలలను సాకారం చేద్దాం

బాలాజీచెరువు: ఆడపిల్లల కలలను సాకారం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషిచేద్దామని ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. ఆదిత్య కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐడీపీ కార్యదర్శి డాక్టర్ అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ బాలికలకు విద్య, వైద్యం, తగిన సౌకర్యాలు కల్పించి అభివృద్ధిచేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్-2025 జాతీయ పోటీల్లో పాల్గొన్న ఎస్.అనుభార్గవిని సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో తేజేశ్వరరావు, గౌరీప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కరప: బాలికలు ఆత్మన్యూనతా భావాలను విడనాడి, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలలపై లైంగిక వేధింపులు గురించి వివరించి, అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ఎక్కడైనా 18 ఏళ్లలోపు బాలకలకు వివాహాలు చేస్తుంటే వెంటనే సమీపంలోని పోలీసుస్టేషన్‌కు కానీ, ఉపాధ్యాయులకు కానీ తెలియజేయాలన్నారు. నిర్భయ, పోక్సో చట్టాలు, గృహహింస నివారణ చట్టం, మహిళా రిజర్వేషన్ వంటి సదుపాయాలు కల్పించారని, అందరూ వాటిని అవగాహన చేసుకోవాలన్నారు. బాలికలు బాగా చదువుకుని, ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పీడీ బీఎస్‌వీఎస్ ప్రసాద్, ఎస్.విజయదుర్గ, భీమాబాయి మహిళా మండలి కార్యకర్తలు టి.అనిత, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



బాలికల హక్కులపై మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసరావు

వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో..

కాకినాడ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాలిపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డీఐవో డాక్టర్ సుబ్బరాజు, హెచ్ఎం జె.సుబ్బలక్ష్మి సహా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలను సంరక్షించుకుందాం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పిఠాపురం రాజా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తరుపాణ్యం మాట్లాడుతూ బాలికలను సంరక్షించాల్సిన బాధ్యత అందిరి మీద ఉందన్నారు. భ్రూణ హత్యలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల చుట్టూ ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థినులు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆంజనేయులు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.జయదేవ్, వి.సంజీవ్ కుమార్, బి.చక్రవర్తి, టీవీవీ సత్యనారాయణ, పీడీ డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను హరించొద్దు

కాకినాడ రూరల్: ఆడపిల్ల అభివృద్ధి యావత్తు సమాజ ప్రగతికి పునాదని, వారి హక్కులను హరించకుండా పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కూతురును, కొడుకుని సమానంగా పెంచే వ్యక్తిత్వం తల్లిదండ్రుల్లో రావాలన్నారు. బాలికలు సరైన స్ఫూర్తితో భవిష్యత్తు పట్ల సానుకూల దృక్పథంతో ఎదగడానికి తగిన వాతావరణం కల్పించాలన్నారు. బాల్య వివాహాలు తగదని, బాలికల విద్యను ప్రోత్సహించాలని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, ఎస్. శ్రీనగేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న భీమాబాయి మహిళా మండలి పీడీ నందివర్ధన



అనుభార్గవిని సత్కరిస్తున్న దృశ్యం



పీఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

వ్యవసాయ కూలీలకు 'ఉపాధి' కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కాకినాడ సిటీ: వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని, వలసలు నివారించాలని, రోజువారీ వేతనం రూ.700 మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్ షణ్మోహన్‌కు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలస పోతున్నారని, దీనిని వెంటనే నివారించాలని కోరుతూ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్‌కు వినతి ఇచ్చామని మధు తెలిపారు. జాబ్‌కార్డుతో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని, చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరామన్నారు. పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యాన్ని, ముఖ్యంగా అధికార పార్టీ నాయకుల ప్రమేయాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయానికి సాగునీరు అందిస్తే ఉపాధి అవకాశాలు పుష్కలంగా పెరిగి, వలసలు తగ్గుతాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కారణాలతో తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మధు డిమాండ్ చేశారు. కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరపు అప్పలరాజు, పప్పు ఆదినారాయణ, సహాయ కార్యదర్శి నక్కా శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తదితరులున్నారు.

హోమ్ ఎక్స్‌పోతో బహుళ ప్రయోజనాలు



హోమ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

బోట్‌క్లబ్: హోమ్ ఎక్స్‌పో ద్వారా నగర ప్రజలు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాల్లో కాకినాడ క్రెడాయ్ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హోమ్ ఎక్స్‌పోను శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రారంభించారు. క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రమణరావు మాట్లాడుతూ గృహ నిర్మాణం చేసుకునే వారికి అవసరమైన మెటీరియల్ కోసం ఎక్కడకీ వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని కంపెనీల ఉత్పత్తులు, బిల్డింగ్ మెటీరియల్, టైల్స్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితరాలన్నీ ఒకేచోట లభించేలా ఈ ఎక్స్‌పో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. క్రెడాయ్ నగర అధ్యక్షుడు విజయకృష్ణ మాట్లాడుతూ భవన నిర్మాణదారులకు ఈ ఎక్స్‌పో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రోజు వచ్చే సందర్శకులకు లక్కీ డ్రా తీసి బహుమతులు అందించనున్నట్టు వారు తెలిపారు. ఎక్స్‌పోలో రంగురంగుల పూల మొక్కలు, గార్డెన్‌కు సంబంధించిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో క్రెడాయ్ జనరల్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు, క్రెడాయి జనరల్ సెక్రటరీ టీవీ రమణరావు, కార్యవర్గ సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, రాయుడు, ప్రసన్న, రాంబాబు, పురం రాంబాబు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు సీఈఓగా గోవిందరాజు



సాధించిన పతకాలు, కప్పులతో గోవిందరాజు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 14 వరకూ జరిగే జాతీయ క్రీడలకు జిల్లాకు చెందిన వెటరన్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, రాష్ట్ర ఒలింపిక్ సంఘ సాధారణ కార్యదర్శి, చుండ్రు గోవిందరాజు సీఈఓ హోదాలో హాజరవుతున్నారు. ఈ మేరకు ఇండియన్ ఒలింపిక్ సంఘం నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. ఈ నెల 25న బయలుదేరి ఆయన జాతీయ క్రీడలకు వెళ్లనున్నారు. మండపేటకు చెందిన చుండ్రు సుబ్బయ్య, సీతమ్మ దంపతులకు జన్మించిన గోవిందరాజు ఐదు దశాబ్దాలుగా కాకినాడలోనే నివాసముంటున్నారు. 16వ ఏట నుంచి క్రీడల్లో పాల్గొన్న ఆయన 60 సంవత్సరాల క్రీడా జీవితాన్ని పూర్తి చేసుకున్నారు. 1969-70లో తొలిసారి ఆంధ్రా యూనివర్సిటీ తరఫున అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీల్లో పాల్గొని పతకం సాధించారు. మూడు దశాబ్దాలుగా షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న గోవిందరాజు 10 జాతీయ, ఒక అంతర్జాతీయ పోటీలో పాల్గొని కప్పులు గెలిచారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యాడ్మింటన్ సంఘానికి అధ్యక్షునిగా, మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా పని చేశారు. ఆ సమయంలో జేఎన్‌టీయూకే ఇండోర్ స్టేడియం, జిల్లా క్రీడా మైదానం ఇండోర్ స్టేడియంలో సౌత్ జోన్ బ్యాడ్మింటన్, రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. 2016-17లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో విజేతగా నిలిచారు. 2018లో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కృష్ణమూర్తితో కలిసి డబుల్స్ విభాగంలో కప్పు గెలుచుకున్నారు. 2009లో స్పెయిన్‌లో జరిగిన పోటీల్లో చుండ్రు గోవిందరాజు - కృష్ణమూర్తి జట్టు 55+ విభాగంలో ప్రతిభ చూపారు. కాకినాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గోవిందరాజుకు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్, మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి అభినందనలు తెలిపారు.


సుకన్య సమృద్ధితో బాలికలకు ఆర్థిక భద్రత



సుకన్య సమృద్ధి పథకాన్ని వివరిస్తున్న సూర్యారావు

కాకినాడ రూరల్: తపాలా కార్యాలయాలలో సుకన్య సమృద్ధి ఖాతాలను తెరవడం ద్వారా బాలికలకు ఆర్థిక భద్రత చేకూరుతుందని తపాలా విశ్రాంత ఉద్యోగి తురగా సూర్యారావు అన్నారు. రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ మేరకు ఆయన అవగాహన కల్పించారు. బాలిక పుట్టిన తేదీ నుంచి పదేళ్ల లోపు ఈ ఖాతాను ప్రారంభించవచ్చుని, ఆమెకు 18 ఏళ్లు వచ్చాక 50 శాతం మొత్తాన్ని విద్యా ఖర్చుల కోసం వాడవచ్చని వివరించారు. బాలిక వివాహం లేదా 21 ఏళ్లు వచ్చేదాకా ఈ ఖాతాను నిర్వహించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం పోస్టల్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాండలిన్ కచేరి



యూపీ రాజు, నాగమణి దంపతులను సంగీత విద్వన్మణి బిరుదుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిరంలో జరుగుతున్న సంక్రాంతి గాన సభల్లో భాగంగా శుక్రవారం యూపీ రాజు, నాగమణి దంపతుల మాండలిన్ కచేరి ప్రేక్షకులను అలరించింది. వీరి కచేరికి మృదంగంపై పారుపల్లి ఫల్గుణ్, ఘటంపై జి.హరిబాబు వాయిద్య సహకారం అందించారు. అనంతరం యూపీ రాజు, నాగమణి దంపతులను సంగీత విద్వన్మణి బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో విద్వత్సభ కార్యవర్గ సభ్యులు నారాయణం మురళి, పేపకాయల రామకృష్ణ, ముళ్లపూడి నాగేశ్వరరావు, ఎస్‌వీఎస్ రావు, వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.

పద్మపూజిత లక్కీ డ్రా విజేతలు వీరే



లక్కీ డ్రా తీస్తున్న మేనేజింగ్ పార్టనర్ రమేష్

బోట్‌క్లబ్: పద్మపూజిత ఆటో ఫైనాన్స్, వీల్స్ మార్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బంపర్ డ్రాలో నల్లాల శివ, భద్రరావు, జగదీష్, వెంకటలక్ష్మి బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పద్మపూజిత మేనేజింగ్ పార్టనర్ రమేష్ మాట్లాడుతూ నెల రోజుల పాటు తమ వద్ద కొనుగోలు చేసిన వాహనదారులకు లక్కీ డ్రా తీసి ల్యాప్‌ట్యాప్‌లు, లెనోవా ట్యాబ్‌లు బహుమతులుగా అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పద్మపూజిత క్లస్టర్ మేనేజర్లు జగదీష్, రవి, ఈశ్వర్, ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. రౌతులపూడి మండలం బంగారయ్యపేటకు చెందిన కర్రి చిన్నేశ్వరరావు (37) గురువారం వ్యక్తిగత కారణాలతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు.

పారిశుధ్య పనుల పరిశీలన

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి, పారిశుధ్య పనుల తనిఖీలకు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన శుక్రవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించి సిబ్బంది విధులను తనిఖీ చేశారు. నగరంలో రామారావుపేట, నాగేశ్వరరావు వీధి, చీడీలపోర మెయిన్ డ్రెయిన్, ఉప్పుటేరును పరిశీలించారు. ఆ డ్రైను ఎలా శుభ్రపరుస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి దుమ్ములపేట చేరుకుని అక్కడ గార్బేజ్ కలెక్షన్ ఎక్స్‌లేటర్‌ను పరిశీలించారు. మరమ్మతులకు గురైన ఎస్క్యులేటర్ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



నగరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన